సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

శుక్రవారం । 12 । జూలై । 2024




అప్పన్నకు ఆర్జిత సేవలు 8లో

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. వైభవంగా స్వర్ణపుష్పార్చన నిర్వహించారు.



విద్యార్థులకు నాణ్యమైన విద్య

గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. 8లో



సిరులతల్లికి పంచామృతాభిషేకం

విశాఖ బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. 8లో

న్యూస్‌రీల్

రూ.3 లక్షల మొబైల్ ఫోన్ల రికవరీ

పోగొట్టుకున్న వారికి అందజేసిన ఎస్పీ



బాధితులకు ఫోన్లను అందజేస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా

పాడేరు : చోరీకి గురైన సుమారు 20 మొబైల్ ఫోన్లను పోలీసులు రికవరీ చేసి, జిల్లా పోలీస్ శాఖ కార్యాలయంలో గురువారం సొంతదారులకు అందజేశారు. ఇటీవల తమ విలువైన మొబైల్ ఫోన్లను పోగొట్టుకున్న బాధితులు సమీప పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేసి, సుమారు రూ.3 లక్షలు విలువ చేసే 20 ఫోన్లను రికవరీ చేశారు. గురువారం జిల్లా పోలీస్ శాఖ కార్యాలయంలో ఎస్పీ తుహిన్ సిన్హా చేతుల మీదుగా బాధితులకు వాటిని అందజేశారు. ఫోన్లను అందుకున్న సొంతదారులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. సెల్ ఫోన్లను రికవరీలో సమర్థంగా విధులు నిర్వహించిన హెచ్‌సీలు సిరాద్దిన్, ప్రసాద్, సిబ్బంది నాగేశ్వరరావులను ఎస్పీ తుహిన్ సిన్హా అభినందించి, రివార్డులను అందజేశారు. కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచి సీఐ హిమగిరి, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విశాఖ రేంజ్ డీఐజీగా గోపీనాథ్ జట్టి



సాక్షి, విశాఖపట్నం : విశాఖ రేంజ్ డీఐజీగా గోపీనాథ్ జట్టి నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. 2008 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన ఆయన గతంలో చింతపల్లి సబ్ డివిజన్ ఏఎస్పీగా పనిచేశారు. 2015లో తిరుపతి అర్బన్ ఎస్పీగా, 2018 వరకు కర్నూల్ ఎస్పీగా పనిచేశారు. అనంతరం తిరుపతి చీఫ్ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ అధికారిగా ఐదేళ్ల పాటు పనిచేశారు. అనంతరం డీఐజీగా పదోన్నతి పొందారు. ప్రస్తుతం గ్రే హౌండ్స్‌లో డీఐజీగా విధులు నిర్వహిస్తున్నారు. ఇక్కడ పనిచేసిన విశాల్ గున్నిని డీజీపీ కార్యాలయాన్ని అటాచ్ చేశారు.

ఫీడర్ల లోపాలపై ప్రత్యేక సర్వే

- ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి

సాక్షి, విశాఖపట్నం : ఏపీఈపీడీసీఎల్ పరిధిలోని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, రాజమహేంద్రవరం, ఏలూరు సర్కిళ్ల పరిధిలో సుమారు 500 ఫీడర్లలో ప్రత్యేక సర్వే నిర్వహించామని ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీ తేజ్ ఇమ్మడి తెలిపారు. సర్వేలో గుర్తించిన లోపాలను పీఎంఐ సర్వే యాప్‌లో నమోదు చేసి వాటిని సరిచేసి అంతరాయాలను తగ్గిస్తున్నామని పేర్కొన్నారు. వినియోగదారులకు విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయాలు లేకుండా, నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టామని వెల్లడించారు. ఆయా సర్కిళ్ల ఎస్ఈలు, ఈఈలు, డీఈఈలతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించి.. విద్యుత్ అంతరాయాల నివారణకు చేపట్టాల్సిన చర్యలకు సంబంధించి సూచనలిచ్చారు. జిల్లాల వారీగా తరచూ ఏర్పడుతున్న అంతరాయాలను గుర్తించేందుకు 33 కెవి ఫీడర్స్, 11 కేవీ ఫీడర్స్‌ని ఎంపిక చేసుకొని వాటిని సర్వే చేసి లోపాలను పీఎంఐ సర్వే మొబైల్ యాప్‌లో నమోదు చేస్తున్నట్లు వివరించారు. విద్యుత్ సంబంధిత సమస్యలను టోల్ ఫ్రీ నంబర్ 1912 కు తెలియచేస్తే సకాలంలో పరిష్కరిస్తామని తెలిపారు.

ట్రిపుల్ ఐటీకి చింతూరు విద్యార్థినులు



వేలు వసుంధర



పండా ఆదిలక్ష్మీప్రియ

చింతూరు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత ఏడాది పదో తరగతిలో ప్రతిభ కనబరచిన ఇద్దరు విద్యార్థినులు ఒంగోలు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. వేలు వసుంధర, పండా ఆదిలక్ష్మీప్రియ గత ఏడాది పదో తరగతి ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించడంతో ట్రిపుల్ ఐటీకి అర్హత సాధించినట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాలకృష్ణ గురువారం తెలిపారు. ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థినులను ఉపాధ్యాయులు సుబ్బయ్య, నాగరాజు, రమేష్, భద్రయ్య, శ్రీని వాస్, రాజు, రత్తయ్య, స్వాతి, సుజాత అభినందించారు.

ఒక్క బిడ్డకేనా వందనం

'నీకు రూ.15 వేలు.. నీకు రూ.15 వేలు.. ఇగో నీకు రూ.15 వేలు'
ఎన్నికల సమయంలో బాగా వైరల్ అయిన ఓ వీడియో చూసే ఉంటారు. ప్రస్తుత రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఓ ఇంటి దగ్గరకు వెళ్లి.. ఆ ఇంట్లో పిల్లలను చూపిస్తూ అందరికీ డబ్బులు వస్తాయని లెక్కలతో సహా చెప్పారు.

పిల్లలను బడికి పంపే తల్లుల విషయంలో జగన్ ప్రభుత్వం మోసం చేస్తోందని.. తాము అధికారంలోకి వస్తే ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అందరికీ తల్లికి వందనం వర్తింపజేస్తామని చంద్రబాబు ఎన్నికల సమయంలో ప్రచారం చేశారు.
కూటమి అభ్యర్థులు కూడా ఇదే విషయాన్ని పదే పదే ప్రస్తావించారు.

కట్ చేస్తే..
పిల్లలను స్కూల్‌కు పంపే అమ్మలకు 'తల్లికి వందనం' పథకం కింద రూ.15 వేలు ఆర్థిక సాయం అంటూ జీవో 29 పేరిట ఉత్తర్వులు జారీ చేసింది. అంటే ఒక ఇంట్లో.. ఒక్కరికే రూ.15 వేలు ఇస్తామని చెప్పకనే చెప్పింది. ఈ పథకం కోసం ఎంతో ఆత్రుతగా ఎదురు చూస్తున్న తల్లుల్లో ఈ జీవోతో గందరగోళం నెలకొనగా.. రానున్న రోజుల్లో ఈ పథకంలో కోత పెట్టే మాయేనని అంతటా చర్చ నడుస్తోంది.





ఈ తల్లులకు భారం తగ్గేనా..



విద్యార్థుల్లోని నాటి ఆనందం వెల్లివిరిసేనా..

- తల్లికి వందనం.. అంతా గందరగోళం
- ఎంతమందైనా రూ.15వేలు చొప్పున ఇస్తామన్న కూటమి ప్రభుత్వం
- తాజా ఉత్తర్వులతో పథకం అమలుపై సందేహాలు
- ఆధార్ అనుసంధానం పేరిట లబ్ధిదారుల ఏరివేతకు కుట్ర
- ఫీజులు కట్టాలని ప్రైవేట్ పాఠశాలల్లో ఒత్తిళ్లు
- తల్లికి వందనం సాయం కోసం ఎదురుచూపు

సాక్షి, పాడేరు: పేద విద్యార్థుల చదువులు సవ్యంగా ముందుకు సాగే పరిస్థితులు కనిపించడం లేదు. 'తల్లికి వందనం' పథకం కింద ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదివే విద్యార్థులకు రూ.15 వేలు చొప్పున ఇచ్చేందుకని ప్రభుత్వం తాజాగా జారీ చేసిన జీవో పలు అనుమానాలకు తావిస్తోంది. తల్లికి వందనం, అదే విధంగా స్టూడెంట్ కిట్ పంపిణీ చేసే విద్యార్థులకు సంబంధించిన సమగ్ర వివరాలు సేకరణకు ప్రభుత్వం సిద్ధం కావడమే ఈ అనుమానాలకు బలం చేకూరిస్తోంది. ఆధార్ అనుసంధానంతో ప్రతి విద్యార్థి బయోమెట్రిక్ అథంటికేషన్ ధ్రువీకరించాలని ప్రభుత్వం తాజాగా స్పష్టం చేసింది. ఎన్నికల్లో కూటమికి ఓటు వేయని వారిని గుర్తించి, అలాంటి లబ్ధిదారులైన విద్యార్థుల పేర్లను జాబితాలోంచి తొలగించాలనే కుట్రల్లో భాగమే ఈ చర్యలని తల్లిదండ్రుల్లో ఆందోళన మొదలైంది.

డబ్బులు మంజూరయ్యేదెప్పుడో?

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నాలుగేళ్ల పాటు అమ్మ ఒడి పథకం మంజూరు చేశారు. 2022–23 సంవత్సరంలో జిల్లాలో 1,01,170 మంది విద్యార్థులకు రూ.127 కోట్లను మంజూరు చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే అధికారంలో ఉండి ఉంటే.. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి జూన్ నెలలోనే విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ అయ్యేవి. అయితే కూటమి ప్రభుత్వం రావడంతో సీన్ రివర్స్ అయింది. తాజాగా పథకం అమల్లో మడతపేచీ పెడుతుండటం అనేక అనుమానాలకు తావిస్తోంది.

ఫీజుల కోసం ప్రైవేటు పాఠశాలల ఒత్తిడి

బడికి వెళ్లే వారు ఎంత మంది ఉన్నా.. అందరికీ ఏడాదికి రూ.15 వేలు ఇస్తామన్న కూటమి ప్రభుత్వ ఎన్నికల హామీతో జిల్లాలోని చాలా మంది ప్రభుత్వ స్కూళ్ల నుంచి ప్రైవేట్ స్కూళ్లలో చేరారు. అందరికీ తల్లికి వందనం డబ్బులు వచ్చే అవకాశం ఉందని, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు సైతం ఇందుకు ప్రోత్సహించాయి. కానీ.. తల్లికి వందనం డబ్బులు ఇప్పట్లో వచ్చే పరిస్థితులు కనిపించకపోవడంతో తమ స్కూళ్ల నిర్వహణ కష్టమని భావించిన ప్రైవేట్ యాజమాన్యాలు ఫీజుల కోసం విద్యార్థులపై ఒత్తిడి పెంచాయి. దీంతో తల్లిదండ్రులు తర్జనభర్జన పడుతున్నారు.

జిల్లాలో వివరాలు

పాఠశాలలు	సంఖ్య	విద్యార్థుల సంఖ్య
రాష్ట్ర ప్రభుత్వస్కూళ్లు	146	11,041
ఎంపీపీ, జెడ్పీ	1,521	55,366
కేజీబీవీ	19	3,601
గిరిజన సంక్షేమ, జీపీఎస్	1,169	78,357
గురుకులాలు	38	12,864
ప్రైవేట్ ఎయిడెడ్	22	913
ప్రైవేట్ అన్ ఎయిడెడ్	56	11,485
నవోదయ	1	270

ఇంకా అందని యూనిఫాంలు

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో బడులు తెరిచిన తొలిరోజునే ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల్లో చదివే విద్యార్థులందరికీ తొమ్మిది రకాల వస్తువులతో కూడిన విద్యా కానుక అందించారు. దీనికి కొనసాగింపుగా 2024–25 విద్యా సంవత్సరానికి ఎన్నికల ముందే అన్ని రకాల వనరులు సమకూర్చారు. ఈ లోగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వీటి పంపిణీ సవ్యంగా జరగలేదు. విద్యా కానుకలను 'స్టూడెంట్ కిట్'గా పేరు మార్చినా.. వాటిని పూర్తి స్థాయిలో అందించే విషయంలో ప్రభుత్వం శ్రద్ధ చూపడం లేదు. విద్యార్థులకు యూనిఫాంలు, షూలు ఇంకా ఇవ్వలేదు.

అంతమందికీ ఇవ్వాలి



తల్లికి వందనం పథకాన్ని అంతమంది పిల్లలకు ఇవ్వాలి. నా పిల్లలు శోభన.. ఏడో తరగతి, అశ్విత మూడో తరగతి, అశన్య, ఒకటో తరగతి ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారు. వారందరికీ కలిపి రూ 45 వేలు ఇస్తే మాకు ఆర్థిక ఇబ్బందులు తొలగుతాయి.

– శ్యామల శోభన, మామిళ్లగూడెం, చింతూరు మండలం

ఇద్దరికీ ఇవ్వాలి



నాకు ఇద్దరు పిల్లలు, గత ప్రభుత్వం హయాంలో నా కుమారుడు చంద్రశేఖర్‌కి నాలుగేళ్ల పాటు అమ్మఒడి పథకం ద్వారా ఏడాదికి రూ.15వేల చొప్పున నా బ్యాంకు ఖాతాలో జమా అయింది. దీంతో ఇద్దరి పిల్లలను చదివించుకునేందుకు ఎంతగానో ఉపయోగపడింది. మా రెండో పాప ఉష్విని కాడెలి పాఠశాలకు పంపిస్తున్నాం. ఐదో తరగతి చదువుతోంది. టీడీపీ ఇచ్చిన హామీ మేరకు ఇద్దరికీ తల్లికి వందనం పథకం వర్తింపజేయాలి. ఈ పథకం కోసం పెట్టి నిబంధనలను సడలించాలి.

– పాంగి నాగమణి, ముళ్ళగరువు, పాడేరు మండలం

ఇబ్బంది పడుతున్నాం



నాకు ముగ్గురు పిల్లలు.చింతపల్లి జిల్లా పరిషత్ ప్రభుత్వ ఆశ్రమోన్నత పాఠశాలలో చదువుతున్నారు. బడికి వెళ్లే పిల్లలందరికీ ఒక్కొక్కరికీ రూ. 15 వేల చొప్పున తల్లికి వందనం పేరిట మంజూరు చేస్తామని టీడీపీ అధినేత చంద్రబాబు హామీ ఇచ్చారు. దీంతో రూ.45 వేలు వస్తాయని ఆశపడ్డాను. అయితే ఇప్పుడు ప్రతి తల్లి ఖాతాలో రూ.15వేలు జమ చేస్తామని జీవో ఇచ్చారు. ఇది తగదు, పిల్లలందరికీ పథకం వర్తింపజేయాలి. పాఠశాలలు ప్రారంభమైనా ఇప్పటి వరకూ పథకం మంజూరు చేయలేదు. దీంతో ఇబ్బంది పడుతున్నాం.

– దొక్క దారలక్ష్మి, అంబేడ్కర్ కాలనీ, చింతపల్లి పంచాయతీ, చింతపల్లి మండలం

ప్రైవేట్ స్కూల్‌లో జాయిన్ చేశా



నాకు ఇద్దరు పిల్లలు. తల్లికి వందనం పథకం కింద రూ.15 వేల చొప్పున మంజూరవుతుందని ఆశపడి ఇద్దరు పిల్లలను ప్రైవేట్ పాఠశాలలో జాయిన్ చేశాను. అయితే ఇంతవరకూ నగదు జమకాలేదు. దీంతో ఫీజు చెల్లించలేకపోయాం. పాఠశాల యాజమాన్యం ఫీజు కోసం వత్తిడి చేస్తోంది. ప్రతి తల్లి పేరిట రూ.15 వేలు మంజూరు చేయనున్నట్టు జీవో జారీ అయింది. దీంతో పిల్లలను ఎలా చదివించాలో అర్థం కావడం లేదు. టీడీపీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు పిల్లలందరికీ తల్లికి వందనం పథకం వర్తింప చేయాలి.

– సుమరాల లోవదారేశ్వరి, సాడిపేట వీధి, చింతపల్లి పంచాయతీ, చింతపల్లి మండలం

మాట నిలుపుకోవాలి



నాకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. పెద్ద పాప సోము స్థానిక ప్రభుత్వ పాఠశాలలో 5వ తరగతి చదువుతోంది. చిన్న పాప మోక్షిత అడ్డతీగల మండలం వేటమామిడిలో హోసన్న ప్రైవేటు పాఠశాలలో 3వ తరగతి చదువుతోంది. ఎంతమంది పిల్లలు బడికి వెళితే అంతమందికీ రూ.15వేల చొప్పున తల్లికి వందన పథకం కింద ఇస్తామని మేనిఫెస్టోలో టీడీపీ ప్రకటించింది. నాకు ఇద్దరు పిల్లలకు రూ.30 వేలు ఇస్తారని ఎదురు చూస్తున్నాం. ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన జీవోలో ప్రతి బిడ్డకు కాకుండా ప్రతి తల్లికి రూ.15 వేలు ఇస్తామని పేర్కొంది. అలాకాకుండా నా ఇద్దరు బిడ్డలకు రూ.30 వేలు మంజూరు చేసి, మాట నిలబెట్టుకోవాలి.

– ఎస్ శేషకుమారి, వై.రామవరం

ముగ్గురు పిల్లలను చదివిస్తున్నా



పేద వ్యవసాయ కుటుంబానికి చెందిన నాకు ముగ్గురు పిల్లలు. వారంతా ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుతున్నప్పటికీ వారి వ్యక్తిగత ఖర్చులు,చదువు అవసరాలకు ఆర్థికంగా ఇబ్బందులు పడే పరిస్థితి. గత ప్రభుత్వం అమ్మ ఒడి పథకం ద్వారా రూ.15వేలు నా బ్యాంకు ఖాతాల్లో జమ చేసింది. టీడీపీ అధినేత చంద్రబాబు పిల్లలందరికీ పథకం వర్తింపచేస్తానని హామీ ఇచ్చారు. ముగ్గురు పిల్లలకు గాను రూ.45వేలు ఆర్థిక సాయం అందుతుందని ఆశించాను.కాని ఇంతవరకు పైసా కూడా నా బ్యాంకు ఖాతాలో జమకాలేదు

– మజ్జి సుమలత, డి.గొందూరు గ్రామం, పాడేరు మండలం

ఫీజు ఎలా కట్టాలో తెలియడం లేదు



పాఠశాలలు ప్రారంభమై ఇన్ని రోజులైనా తల్లికి వందనం పథకం డబ్బులు రాలేదు. వాటి కోసం ఎదురు చూస్తున్నాం. ఆ డబ్బులు వస్తాయని ఆశతో మా బాబును ప్రైవేట్ పాఠశాలకు పంపుతున్నాం. ఇప్పుడు ఫీజు కట్టాలని పాఠశాల యాజమాన్యం తీవ్రంగా వత్తిడి చేస్తోంది. ఫీజు ఎలా కట్టాలో, ఏం చేయాలో పాలుపోవడం లేదు.

– బంగురు సుశీల, బెడ్డగుడ గ్రామం, పద్మాపురం పంచాయతీ, అరకులోయ మండలం

మాట నిలబెట్టుకోవాలి



ఎంతమంది పిల్లలు బడికి వెళితే అంతమందికీ రూ.15 వేల చొప్పున తల్లికి వందనం పథకం కింద మంజూరు చేస్తామని టీడీపీ అధినేత చంద్రబాబు ఎన్నికల ముందు హామీ ఇచ్చారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలి. ప్రతి తల్లిపేరిట రూ.15వేల జమ చేస్తామని జీవో విడుదల చేయడం సరికాదు. నాకు ఇద్దరు పిల్లలు. కుమార్తె సారిక తొమ్మిదో తరగతి, కుమారుడు చెర్రిబాబు ఐదో తరగతి చదువుతున్నారు. వారిద్దరికీ రూ.15వేల చొప్పున రూ.30వేలు ఇవ్వాలి

– సవలం లలిత, చూటూరు, చింతూరు మండలం

డబ్బుల కోసం ఎదురు చూస్తున్నాం



నాకు ఇద్దరు పిల్లలు. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో పెద్ద పాప ప్రియ 5వ తరగతి చదువుతోంది. చిన్నపాప గోపిక మహి 3వ తరగతి చదువుతోంది. టీడీపీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించినట్టుగా ఎంత మంది పిల్లలు బడికి వెళ్లితే అంతమందికీ తల్లికి వందనం పథకం రూ. 15 వేల చొప్పున మంజూరు చేయాలి. నా ఇద్దరు పిల్లలకు రూ.30 వేలు ఇస్తారని ఎదురు చూస్తున్నాం. అయితే ఇటీవల విడుదల చేసిన జీవోలో ప్రతి తల్లికి రూ.15 వేల చొప్పున ఇస్తామని ప్రభుత్వం పేర్కొంది. ప్రతి తల్లికీ కాకుండా ప్రతి బిడ్డకు రూ. 15వేల చొప్పున ఇవ్వాలి.

– ఆర్.వీరలక్ష్మి, వై.రామవరం

చదివించడం కష్టంగా ఉంది



ఇంట్లో ఎంతమంది పిల్లలు బడికి వెళితే వారందరికీ ఒక్కొక్కరికీ రూ.15వేల చొప్పున తల్లికి వందనం పథకం ద్వారా చెల్లిస్తామని ఎన్నికల ముందు టీడీపీ హామీ ఇచ్చింది. అయితే ఇప్పుడు ప్రతి తల్లి ఖాతాలో రూ.15 వేలు జమచేస్తామని చెబుతున్నారు. నాకు ఇద్దరు పిల్లలు. వారిని చదివించడం కష్టంగా ఉంది. టీడీపీ అధికారంలో రావడంతో వారిద్దరికీ పథకం వర్తిస్తుందని ఆశపడ్డాను. ఇచ్చిన హామీని చంద్రబాబు నిలబెట్టుకోవాలి.

– పి.రాధ, రాజేంద్రపాలెం, కొయ్యూరు మండలం

తల్లికి వందనంపై సందేహం



నాకు ఐదుగురు పిల్లలు, 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారు. నా పిల్లల్లో సురేష్ 10వ తరగతి, అఖిల 8, రాజేష్ 6, అజయ్ 5, శివగణేష్ 3వ తరగతి చదువుతున్నారు. తల్లికి వందనం పథకం కింద ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికి రూ.15వేల చొప్పున మంజూరు చేస్తామని ఎన్నికల ముందు టీడీపీ అధినేత చంద్రబాబు చెప్పారు. తాజాగా విడుదల చేసిన జీవోలో ఆధార్‌కార్డు ఉన్న ప్రతి తల్లిపేరు మీద రూ.15వేలు జమచేస్తారని పేర్కొన్నారు. ఇలా అయితే ఎలా... ప్రభుత్వం హామీ అమలవుతుందా లేదా అన్న సందేహం కలుగుతోంది.

– ముత్యాల లక్ష్మి, కూనవరం

వరదలను సమర్థంగా ఎదుర్కొందాం

- ప్రాణ, ఆస్తి నష్టం లేకుండా చర్యలు
- కలెక్టర్ దినేష్‌కుమార్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

సాక్షి,పాడేరు: జిల్లాలో గోదావరి, శబరి నదులకు రానున్న వరదలను సమర్థంగా ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. గురువారం తన క్యాంపు కార్యాలయం నుంచి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.వరదలకు ముందుగానే సమాచారం వస్తుందని, ఐదురోజుల ముందుగానే అవసరమైన సామగ్రిని సిద్ధం చేయాలని సూచించారు. పునరావస కేంద్రాల ఏర్పాటు చేయాలని, బోట్లు, లాంచీలు, ట్రాక్టర్లు, డీజిల్, కిరోసిన్, సోలార్ లైట్లు, దోమ తెరలు, మందులు అందుబాటులో ఉంచాలని తెలిపారు. వరదల కారణంగా ఎటువంటి ప్రాణ,ఆస్తి నష్టం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇందుకు అవసరమైన పక్కా ప్రణాళికను సిద్ధం చేయాలని తెలిపారు. ఆగస్టు,సెప్టెంబర్ నెలలకు సంబంధించిన రేషన్ సరకులను ముందుగానే పంపిణీ చేయాలని సూచించారు. ప్రతి పునరావస కేంద్రంలో వైద్యశిబిరాలు ఏర్పాటు చేయడంతో పాటు పూర్తిస్థాయిలో మందులు సిద్ధంగా ఉంచాలని చెప్పారు. గత ఏడాది వరదల సమయంలో బాధితులకు అందించిన సహాయసహకారాలను దృష్టిలో పెట్టుకుని ఈఏడాది కూడా కార్యాచరణ అమలుజేయాలన్నారు. పునరావస కేంద్రాలు, కంట్రోల్‌రూమ్‌లలో 24గంటలు విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పారిశుధ్య కార్యక్రమాలను విస్తృతం చేయాలన్నారు.రోడ్లు, విద్యుత్ మరమ్మతులపై మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మునిగిపోయే రోడ్లను గుర్తించాలన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని,కిరోసిన్,డీజిల్,ఇతర నిత్యావసరాలకు స్టాక్ పాయింట్‌లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే మాట్లాడుతూ పాలు,గుడ్లు అందుబాటులో ఉంటాయని, వాటిని 15రోజులు ముందుగానే పంపిణీ చేయాలన్నారు. చింతూరు ఐటీడీఏ పీవో చైతన్య మాట్లాడుతూ వరద బాధితుల తరలింపు,పునరావస కేంద్రాల ఏర్పాటు, ముందుగానే రేషన్ సరకులు తరలింపు ఏర్పాట్లకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. చింతూరు ఏఎస్పీ మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ కటాఫ్ పాయింట్ వద్ద పోలీసులను నియమిస్తామని,వలంటీర్ల సేవలను వినియోగిస్తామన్నారు.ఈ సమావేశంలో జేసీ భావన వశిష్ట,పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యాప్రమాణాల పెంపునకు కృషి

- ఐటీడీఏ పీవో అభిషేక్



కేజీబీవీలో విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్

అనంతగిరి: విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలను పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఐటీడీఏ పీవో అభిషేక్ అన్నారు. మండలంలో శివలింగపురం బాలుర పాఠశాల, కొత్తూరు కేజీబీవీని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా విద్యార్థుల హాజరు పట్టి, స్టాక్ రికార్డులను పరిశీలించారు. ఇప్పటి వరకు ఎంతమందికి నోట్ పుస్తకాలు, షూలు పంపిణీ చేశారో అధికారులను అడిగితెలుసుకున్నారు. శివలింగపురం ఆశ్రమ బాలుర పాఠశాలలోని విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. భారతదేశం మ్యాప్, చుట్టూ ఉన్న దేశాల పేర్లను విద్యార్థులను అడిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయిని నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. కేజీబీవీలో ఇంటర్, పదో తరగతి విద్యార్థినులతో మాట్లాడారు. ఇంటర్ పాసైన తరువాత ఏంచేస్తారని విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. ఐఐటీ, జేఈఈ తదితర కోర్సులపై అవగాహన కల్పించారు. ప్రాథమికస్థాయి నుంచి విద్యా ప్రమాణాలు మెరుగుపరచాలని, ఆ దిశగా ఉపాధ్యాయుల బోధన ఉండాలన్నారు. డీడీ కొండలరావు, ఎంపీడీవో నగేష్, ఏటీడబ్ల్యూవో కూడ వెంకటరమణ, సర్పంచ్ సీతయ్య పాల్గొన్నారు.

అధిక జనాభాతో సమస్యలు



పాడేరులో ర్యాలీ నిర్వహిస్తున్న డీఎంహెచ్‌వో జమల్‌బాషా, వైద్యారోగ్య శాఖ ఉద్యోగులు

పాడేరు : జనాభా పెరుగుదలతో పలు సమస్యలు ఏర్పడుతున్నాయి. జనాభాకు తగినంత వనరులను సమకూర్చుకూర్చుకోలేకపోతున్నారని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ జమల్‌బాషా తెలిపారు. మినుములూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా నియంత్రణ దినోత్సవాన్ని గురువారం పాడేరులో నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ ఏఎన్ఎం శిక్షణ కేంద్రం నుంచి మెయిన్ బజారు మీదుగా పాత బస్టాండ్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. అధిక సంతానం వద్దు ఇద్దరు పిల్లలు ముద్దు, చింతలేని కుటుంబం చింతలేని కుటుంబం, పెరుగుతున్న జనాభాను తగ్గిదాం అంటూ నినాదాలు చేశారు. పాత బస్టాండ్ వద్ద మానవహారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ అధిక సంతానంతో పిల్లల్లో ఎదుగుదల లోపిస్తుందని మందబుద్ధి గల పిల్లలు పుట్టే ప్రమాదం ఉందని చెప్పారు. పిల్లల్లో రక్తహీనత కూడా వస్తుందన్నారు. వైద్యారోగ్య శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులంతా జనాభా నియంత్రణ కోసం గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. మినుములూరు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ సాయిశ్రీ, ఎంపీహెచ్ఈవో గుల్లేలి సింహాద్రి, హెచ్‌వో వరలక్ష్మి, గిరిజన ప్రాంత వైద్యారోగ్య ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు శెట్టి నాగరాజు, హెల్త్ సిబ్బంది కె. లక్ష్మణరావు, బుజ్జి, ఏఎన్ఎం శిక్షణ కేంద్రం విద్యార్థులు పాల్గొన్నారు.

పలు రైళ్లు రీ షెడ్యూల్



తాటిచెట్లపాలెం(విశాఖ): పలు స్టేషన్లకు రైళ్లు ఆలస్యంగా చేరుకున్నందున ఆయా స్టేషన్‌ల నుంచి గురువారం పలు రైళ్లు ఆలస్యంగా బయల్దేరాయి. ఈ రైళ్లు అంతే ఆలస్యంగా ఆయా స్టేషన్‌లకు చేరుకోనున్నాయి. ఎస్ఎంవీ బెంగళూరులో గురువారం ఉదయం 10.35గంటలకు బయల్దేరాల్సిన ఎస్ఎంవీ బెంగళూరు– హౌరా(12864)సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ సుమారు 9గంటలు ఆలస్యంగా రాత్రి 7.30గంటలకు బయల్దేరింది. షాలిమర్‌లో గురువారం సాయంత్రం 3.20 గంటలకు బయల్దేరాల్సిన షాలిమర్– ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ (12841) కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ రెండు గంటలు ఆలస్యంగా సాయంత్రం 5.20గంటలకు బయల్దేరింది.

క్లుప్తంగా

గంజాయితో విద్యార్థి అరెస్టు



నిందితుడితో అనంతగిరి పోలీసులు

అనంతగిరి: ఆర్టీసీ బస్సులో మైదాన ప్రాంతానికి తరలిస్తున్న నాలుగు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, ఓ బీటెక్ విద్యార్థిని అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ కరక రాము తెలిపారు. డముకు చెక్‌పోస్ట్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఆర్టీసీ బస్సులోని గంజాయి బయటపడిందని చెప్పారు. గంజాయి తరలిస్తున్న గంటూరు జిల్లా నడికుడి గ్రామానికి చెందిన యానాల మధుసూదన్ అనే బీటెక్ విద్యార్థిని అరెస్టు చేసినట్టు తెలిపారు. ఒడిశాలోని పాడువా దురుబు గ్రామానికి చెందిన కొర్రా గోవిందు వద్ద రూ.20వేలకు గంజాయిని కొనుగోలుచేసినట్టుగా దర్యాప్తులో తేలిందన్నారు. నిందితుడిని రిమాండ్ నిమిత్తం సెంట్రల్‌జైలుకు తరలించినట్టు ఎస్‌ఐ తెలిపారు.

మేకను మింగిన కొండచిలువ



మేకను మింగిన భారీ కొండచిలువ

అనంతగిరి: లుంగపర్తి పంచాయతీ వేలగలపాడు అటవీ ప్రాంతంలోని గురువారం మేకను ఓ భారీ కొండచిలువ మింగి ఉండడాన్ని స్థానికులు చూసి భయాందోళన చెందారు. కొండచిలువ సుమారు 15 అడుగులు ఉందని వారు చెప్పారు. అటవీ ప్రాంతానికి కొంతమంది తమ మేకలను మేత కోసం తోలుకుని వెళ్లారు. కొంతసేపటి తరువాత బండరాయి పక్క నుంచి మేక అరుపులు వినిపిస్తుండడంతో కాపరులు వెళ్లి చూడగా, అప్పటికే కొండచిలువ మేకను మింగే ఉన్నట్టు గుర్తించారు.

గుర్తుతెలియని వృద్ధురాలి మృతదేహం లభ్యం

ఎటపాక: పురుషోత్తపట్టణం శివారులో గుర్తుతెలియని వృద్ధురాలి మృతదేహం గురువారం లభ్యమైంది. పొలాల్లో మృతదేహం ఉందనే సమాచారంతో ఎటపాక ఎస్‌ఐ పార్థసారథి ఘటన ప్రాంతానికి వెళ్లి విచారణ జరిపారు. వృద్ధురాలు వారం రోజులుగా ఈప్రాంతంలో తిరుగుతూ భోజనం అడిగి తింటున్నట్టు గ్రామస్తులు తెలిపారు. అనారోగ్యం కారణంగా మరణించి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతురాలి వివరాలను సేకరిస్తున్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య

- కలెక్టర్ దినేష్‌కుమార్



జి.మాడుగులలో పీహెచ్‌సీని పరిశీలిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

జి.మాడుగుల: గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. మండలంలో పలు మారుమూల గ్రామాల్లో ఆయన గురువారం సుడిగాలి పర్యటన చేశారు. స్థానిక పీహెచ్‌సీని సందర్శించి, బూగురువీధి,తోకగరువు, మండిభ, కోడిమామిడి తదితర గ్రామాల్లో పర్యటించారు. పాఠశాలలు, వివిధ అభివృద్ధి పనులను తనిఖీ చేశారు. చిన వాకపల్లి పీవీటీజీ గ్రామంలో ప్రజల సమస్యలను తెలుసుకుని, పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. బొయితిలి గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమోన్నత పాఠశాలను తనిఖీ చేసి, విద్యార్థుల విద్యా ప్రమాణాలను పరిశీలించారు. విద్యార్థులకు చర్మ వ్యాధులు సోకకుండా వైద్య సేవలు అందించాలని వైద్య సిబ్బందిని ఆయన ఆదేశించారు. ఆశ్రమ పాఠశాలలో మెనూ సక్రమంగా అమలు చేయాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఆశ్రమ పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న భవన నిర్మాణాలకు నిధులు విడుదల చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.అనంతరం కోడిమామిడి గెడ్డపై వంతెన నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. కిల్లంకోట గ్రామాన్ని ఆయన సందర్శించారు. గ్రామంలో పలు సమస్యలను స్థానికులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. గ్రామంలో ఉపాధి హామీ పథకం పనులు కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామంలో ఆర్వో ప్లాంట్‌కు మరమ్మతు చేసి, వినియోగంలోనికి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. సుబ్బులు గ్రామంలో ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించి, వారపు సంతలో తనిఖీలు జరిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో లోహిత్ జయసాగర్,తహసీల్దార్ నర్సమ్మ, పీఆర్ ఈఈ కొండయ్యపడాల్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విజయ్‌కుమార్, సర్పంచ్ కిముడు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



మద్దిగరువు వారపుసంతలో విక్రయిస్తున్న వస్తువులను పరిశీలిస్తున్న కలెక్టర్

వరదలపై అప్రమత్తం

ఐటీడీఏ పీవో కావూరి చైతన్య



చింతూరు: వరదలు సంభవిస్తే ఎదుర్కొనేందుకు అప్రమత్తంగా ఉన్నామని, దీనికి సంబంధించి తగిన ఏర్పాట్లు చేశామని చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య గురువారం తెలిపారు. చింతూరు డివిజన్‌లోని చింతూరు మండలంలో 35, కూనవరంలో 32, వీఆర్‌పురంలో 34, ఎటపాకలో 48 వరద సహాయక శిబిరాలు ఏర్పాటు చేశామని, ప్రతి మండల కేంద్రంతో పాటు ఐటీడీఏ కార్యాలయంలో కంట్రోల్ రూంలు ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. వరద సహాయక చర్యల నిమిత్తం సోషల్ మీడియా గ్రూపులను ఏర్పాటు చేయడంతో పాటు వరద బాధితులకు అందించేందుకు ఆయా మండలాల రేషన్ దుకాణాలకు, ఎంఎల్‌ఎస్ పాయింట్లకు రేషన్ సరకులు తరలించినట్లు చెప్పారు. అవసరమైన ప్రదేశాల్లో జనరేటర్లు ఏర్పాటు చేయాలని తహసీల్దార్లు, విద్యుత్‌శాఖ సిబ్బందిని ఆదేశించామని, గుడారాలు వేసుకునే వారికి టార్పాలిన్లు అందించేందుకు అవసరమైన టార్పాలిన్లను తెప్పిస్తామని పీవో తెలిపారు. తాగునీరు అందించేందుకు అవసరమైన ప్రాంతాల్లో కొత్తబోర్ల ఏర్పాటుతో పాటు పాతబోర్లకు మరమ్మతులు, ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టినట్టు చెప్పా రు. గర్భిణులను గుర్తించి ముందుగానే చింతూరు ఏరియా ఆస్పత్రి తరలించాలని ఆదేశించినట్లు తెలిపారు. గర్భిణులకు పౌష్టికాహారం అందించేందుకు రెండు నెలల స్టాకు ముందుగానే సమకూర్చుకోవాలని ఐసీడీఎస్ అధికారులను, లాంచీలు, మర పడవలతో పాటు రవాణాకు ట్రాక్టర్లను సిద్ధంగా ఉంచాలని రెవెన్యూ, మండల పరిషత్ అధికారులను ఆదేశించినట్టు పీవో తెలిపారు. కొండ ప్రాంతాల్లోని శిబిరాల్లో ఉండే బాధితుల కోసం టార్చిలైట్లు సిద్ధంగా ఉంచామని, కలెక్టర్ ఆదేశాల మేరకు వరద సహాయక చర్యలు పర్యవేక్షించేందుకు మండలానికి ఒక ఐఏఎస్ అధికారితో పాటు ఆయన ఆధ్వర్యంలో విధులు నిర్వహించేందుకు ఇద్దరు తహసీల్దార్లు, ఇద్దరు ఎంపీడీవోలను, ఇద్దరు డిప్యూటీ తహసీల్దార్లను నియమించనున్నామని పీవో తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాడేరు : పెదబయలు, ముంచంగిపుట్టు మండలాల్లోని అన్ని గ్రామాలతో పాటు హుకుంపేట మండలం బాకూరు, అడ్డుమండలలో శుక్రవారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్టు పాడేరు విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎ.వి. ఎన్.ఎం అప్పారావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయా లైన్లలో చెట్ల కొమ్మలు తొలగించడంతో పాటు విద్యుత్ సబ్ స్టేషన్లలో మరమ్మతు పనుల నిమిత్తం విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్టు ఆయన పేర్కొన్నారు.

చింతూరు: విద్యుత్ లైను మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు చింతూరు మండలంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏడీఈ మలాకీ గురువారం తెలిపారు. 33 కేవీ, 11 కేవీ లైనుల్లో మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

అడ్డతీగల : రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా విద్యుత్ లైన్లకు దగ్గరలో ఉన్న చెట్ల కొమ్మలు తొలగించే పనులు జరుగుతున్నాయని, అందువల్ల శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అడ్డతీగల, వై రామవరం, రాజవొమ్మంగి మండలాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు రంపచోడవరం ఎలక్ట్రికల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ యూసఫ్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

మారేడుమిల్లి : మండలంలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ ఎండీ యూసఫ్ గురువారం తెలిపారు. జంగిల్ క్లీయరెన్స్‌లో భాగంగా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

అంధకారంలో గోమంగి

పెదబయలు: గత నాలుగు రోజులుగా మండలంలో గల గోమంగి పంచాయతీ కేంద్రంలో విద్యుత్ సరఫరా లేక ప్రజలు అంధకారంలో ఉన్నారని గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి కె.రాధాకృష్ణ తెలిపారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ గోమంగి పంచాయతీ కేంద్రంలో విద్యుత్ సరఫరా లేక గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. గోమంగి ప్రభుత్వ ఆస్పత్రి, మినీ గురుకుల విద్యార్థులు విద్యుత్ కష్టాలు పడుతున్నారని, రోగులకు చీకట్లోనే వైద్య సేవలు అందించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. గోమంగితో పాటు సంతవీధి, సరియాపల్లి కాలనీ, డెండ్రాయి, గల్లేల, సావిడి మామిడి, ఊబలా గ్రామాల్లో విద్యుత్ సరఫరా లేదని, విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్ల నాలుగు రోజులు కావస్తున్నా విద్యుత్ సమస్యను పరిష్కారం కాలేదన్నారు. మారుమూల గిరిజన గ్రామాల్లో విద్యుత్ సమస్య పరిష్కారంలో ఇంత నిర్లక్ష్యం తగదని ఆయన అన్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖాధికారులు గోమంగి పంచాయతీల్లో విద్యుత్ సమస్య పరిష్కరించాలని ఆయన కోరారు.

సిరులతల్లికి పంచామృతాభిషేకం

డాబాగార్డెన్స్(విశాఖ): బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో 32 మంది ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసుల రెడ్డి, సహాయ కార్యనిర్వహణాధికారి కె. తిరుమలేశ్వరరావు, రాంబాబు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

21న బోనాల పండగ

వై.రామవరం: మండల సరిహద్దు గ్రామమైన వెదురునగరం శివసాయిభువనేశ్వరి ఆశ్రమంలో ఈనెల 21న శ్రీమహంకాళీ అమ్మవారి బోనాల పండగ నిర్వహించనున్నట్టు ఆశ్రమ నిర్వాహకులు సాయిరామ్ గురుస్వామి తెలిపారు. గురుపౌర్ణమి, వారాహి నవరాత్రులను పురస్కరించుకుని లోక కల్యాణార్థం ఈ పండగను భారీ ఎత్తున నిర్వహించనున్నట్టు తెలిపారు. ఆరోజు ఉదయం 7 గంటలకు గురు పూజ, 8గంటలకు బోనాల ఊరేగింపు, 9 గంటలకుఅమ్మవారికి బోనాల సమర్పణ కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. అనంతరం అన్న సమారాధన నిర్వహించనున్నట్టు చెప్పారు.

పెళ్లి మాటున వంచన..

- యువకుడి మాయలో మోసపోయిన పాడేరు యువతి
- అవసరం తీరాక అజ్ఞాతంలోకి వెళ్లిన గుంతకల్లు ప్రేమికుడు
- న్యాయం జరిగే వరకూ ఇక్కడి నుంచి కదిలేది లేదన్న బాధితురాలు

గుంతకల్లు రూరల్ (అనంతపురం జిల్లా): ప్రేమ పేరుతో నమ్మించాడు... పెళ్లి చేసుకుంటానని రప్పించాడు... శారీరక అవసరం తీరాక అజ్ఞాతంలోకి వెళ్లాడు. 875 కిలోమీటర్లకు పైగా దూరం నుంచి వచ్చిన యువతి నిస్సహాయ స్థితిలో పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలు నందిని తెలిపిన వివరాలు ఆమె మాటల్లోనే...

ఫోన్ కాల్ పరిచయం...

మాది అల్లూరి సీతారామారాజు జిల్లా పాడేరు గ్రామం. నా చిన్నప్పుడే నాన్న చనిపోయాడు. అమ్మ కౌసల్య కూలి పనులతో నన్ను పదో తరగతి వరకూ చదివించింది. ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో చదువు మానేసి, కూలి పనులతో అమ్మకు చేదోడుగా ఉంటూ వచ్చాను. సరిగ్గా ఆరేళ్ల క్రితం నా సెల్‌ఫోన్‌కు ఓ కాల్ వచ్చింది. అవతలి వ్యక్తి తన పేరు స్వామి అని తెలిపాడు. పొరపాటున కాల్ వచ్చిందని తెలిపాడు. దీంతో రాంగ్ నంబర్ అని తెలుసుకుని ఇద్దరమూ ఫోన్ కట్ చేశాం. అయితే అక్కడితో ఆయన ఆగలేదు. అప్పుడప్పుడు ఫోన్ చేసి పలకరించేవాడు. ఆ పరిచయం మా మధ్య ప్రేమకు దారి తీసింది. రాను రాను ఫోన్‌లో గంటల తరబడి అర్ధరాత్రి వరకూ మాట్లాడుకునేవాళ్లం. ఒకరి ఫొటోలు మరొకరు షేర్ చేసుకున్నాం. వీడియో కాల్స్‌తో మరింత దగ్గరయ్యాం.

తనకు పెళ్లయిందన్నాడు

మా పరిచయం ప్రేమగా మారిని కొన్నాళ్లకు స్వామి తనది అనంతపురం జిల్లా గుంతకల్లు అని తెలిపాడు. ఓ పెట్రోల్ బంక్‌లో పనిచేస్తున్నట్లుగా, తనకు ఇదివరకే పెళ్లి అయిందని... భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారని చెప్పాడు. దీంతో ఒక్కసారిగా నివ్వెర పోయాను. పెళ్లి అయి ఉండి ప్రేమ పేరుతో నాకేందుకు దగ్గరయ్యావని ప్రశ్నించా. ఈ విషయం మొదట్లోనే చెబితే ఎక్కడ దూరం అవుతావోననే భయంతో చెప్పలేదన్నాడు. రోజూ నాతో మాట్లాడకపోతే బతకలేనని, తనను నమ్మాలని ప్రాధేయపడ్డాడు. చాలామంది రెండేసి పెళ్లిళ్లు చేసుకుంటున్నారని, అలాగే నన్నూ రెండో పెళ్లి చేసుకుంటానన్నాడు. ప్రాధేయపడ్డాడు. ఆయన మాటలు నమ్మాను.

పెళ్లి చేసుకుంటానంటే వచ్చా..

కొన్ని రోజుల క్రితం పెళ్లి ప్రస్తావన లేవనెత్తాను. అయితే అంత దూరం తాను రాలేనని, నన్నే గుంతకల్లుకు రమ్మని చెప్పాడు. ఒక్కదాన్నే అంతదూరం రావడం ఎలా? అని ఆందోళనతో అడిగా. చదువుకున్నదానివి ఆ మాత్రం రాలేవా? అంటూ ధైర్యం చెప్పాడు. అన్ని విధాలుగా తోడుంటానన్నాడు. దీంతో ధైర్యం చేసి ఈ నెల 9న పాడేరులో బయలుదేరి మరుసటి రోజు కర్నూలుకు చేరుకున్నా. అప్పటికే అక్కడ నా కోసం స్వామి ఎదురు చూస్తూ ఉన్నాడు. తర్వాత ఇద్దరమూ కలసి గుంతకల్లుకు చేరుకున్నాం. గుంతకల్లు పట్టణ శివారులోనే కసాపురం రోడ్డు సమీపంలో స్వామి అప్పటికే తీసి ఉంచిన ఖాళీగా ఉన్న గదికి చేరుకున్నాం. మరుసటి రోజు పెళ్లి చేసుకునేందుకు ఏర్పాట్లు చేశానని చెప్పడంతో నా ఆనందానికి అవధుల్లేకుండాపోయాయి. ఆ సమయంలోనే స్వామి మాయమాటలతో నన్ను లోబర్చుకున్నాడు.

అవసరం తీరాక వెళ్లిపొమ్మన్నాడు

తన శారీరక అవసరం తీరాక స్వామి అసలు రూపం బయటపెట్టాడు. నన్ను మా ఊరికి వెళ్లిపోవాలన్నాడు. నేను కాదూ కూడదన్నాను. పెళ్లి చేసుకుంటానంటే ఇంత దూరం వచ్చానన్నా. ఇప్పుడు అవసరం తీరాక నన్ను వదిలించుకోవాలనుకుంటే తాను ఊరుకునేది లేదని చెప్పా. జీవితమంతా ఇక్కడే ఉంటానని, ఎలాంటి పరిస్థితుల్లోనూ పెళ్లి కాకుండా ఊరికి వెళ్లేది లేదని చెప్పాను. దీంతో కాసేపు స్వామి మౌనంగా ఉండిపోయాడు. తర్వాత అలా బయటకు వెళ్లి తినేందుకు ఏదైనా తీసుకువస్తానని చెప్పి వెళ్లాడు. బుధవారం సాయంత్రం నన్ను గదిలో వదిలేసి వెళ్లినోడు గురువారం ఉదయం వరకూ తిరిగి రాలేదు. దీంతో నన్ను స్వామి మోసం చేశాడని తెలుసుకుని కుమిలి పోయాను. విషయాన్ని కసాపురం పోలీసులకు తెలిపి నాకు న్యాయం చేయాలని కోరాను. నాకు న్యాయం జరిగే వరకూ ఇక్కడి నుంచి నేను పోను.

విచారణ చేస్తున్నాం

బాధితురాలు నందిని చేసిన ఫిర్యాదు మేరకు వివరాలు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నాం. యువతిని వదిలి వెళ్లిన స్వామికి ఫోన్ చేసి స్టేషన్‌కు రప్పించే ప్రయత్నం చేస్తున్నాం. ఆయన రాగానే పూర్తి వివరాలు విచారణ చేసి సరైన చర్యలు తీసుకుంటాం.

– దుగ్గిరెడ్డి, ఎస్‌ఐ, కసాపురం పోలీస్ స్టేషన్

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న పీవో అభిషేక్

అరకులోయ రూరల్ (డుంబ్రిగుడ): నాణ్యమైన భోజనంతోనే విద్యార్థుల ఆరోగ్యం మరింత బాగుంటుందని పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ చెప్పారు. మండలంలో కిల్లోగుడ ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఇంగ్లిష్ మీడియం పాఠశాల వసతి గృహాన్ని ఆయన గురువారం రాత్రి ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థులతో కలిసి భోజనాలు చేశారు. పాఠశాలలో పరిశుభ్రత, నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేసి, హెచ్‌ఎం కళావతి, హెచ్‌డబ్ల్యూవో పద్మను అభినందించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఆయన వెంట డీడీ కొండలరావు, ఏటీడబ్ల్యూవో మల్లికార్జునరావు తదితరులున్నారు.

విద్యార్థిని చికిత్సకు పీవో ప్రత్యేక చొరవ

విద్యార్థులతో పాఠశాలలో వసతులపై మాట్లాడారు. ఈ సందర్భంగా పదో తరగతి చదువుతున్న గొల్లోరి అనూష ముక్కుపై పెద్ద కాయ ఉన్నట్టు గుర్తించారు. విద్యార్థినితో మాట్లాడారు. ముక్కుపై ఉన్న కాయ తొలగింపుపై గతంలో స్పందన కార్యక్రమంలో దరఖాస్తు చేయడం, అయితే కుటుంబసభ్యులు రాకపోవడంతో శస్త్ర చికిత్స జరగలేనట్టు తెలుసుకున్నారు. విద్యార్థిని నిరుపేద కావడంతో శస్త్రచికిత్స చేయించుకోలేని పరిస్థితి ఉందని పలువురు చెప్పారు. దీనిపై పీవో అభిషేక్ స్పందించి విద్యార్థినికి శస్త్రచికిత్స నిమిత్తం విశాఖపట్నంలో ఆస్పత్రికి తరలిస్తామని, తన సొంత ఖర్చులతో శస్త్ర చికిత్స చేయిస్తానని హామీ ఇచ్చారు.

గిరిజన సంఘం నాయకుల గృహ నిర్బంధం తగదు



పోలీసుల పర్యవేక్షణలో గృహ నిర్బంధంలో ఉన్న గిరిజన సంఘం నాయకుడు అప్పలనర్స

పాడేరు: ముఖ్యమంత్రి చంద్రబాబు విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల పర్యటనకు వస్తే పాడేరులో ఉన్న ఆదివాసీ గిరిజన సంఘం నాయకులను గృహ నిర్బంధం చేయడం తగదని ఆ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు పి.అప్పలనర్స అన్నారు. గురువారం ఉదయాన్నే తనతో పాటు ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా నాయకుడు వంతాల దాస్‌ను పోలీసులు తన ఇంటి వద్ద గృహ నిర్బంధం చేశారన్నారు. మఫ్టీలో ఉన్న పోలీసులు ఉదయాన్నే ఇంటికి వచ్చి తమల్ని కదలనీయకుండా చేశారన్నారు. ఈ వ్యవహారంపై ప్రజాస్వామ్యవాదులు, ఆదివాసీ సంఘాలు, ప్రజా సంఘాలు ముక్తకంఠంతో ఖండించాలన్నారు. విశాఖపట్నం డెక్కన్ క్రానికల్ పత్రిక కార్యాలయంపై టీడీపీ నాయకులు దాడులకు తెగబడటంపై గిరిజన సంఘం ఖండిస్తుందన్నారు. పత్రిక కార్యాలయాలపై, జర్నలిస్టులపై దాడులు చేయడం సరైన సంస్కృతి కాదన్నారు. బాధ్యులపై కేసులు నమోదు చేసి భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు పునావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

అడవిపంది దాడిలో గిరిజనుడికి గాయాలు



గాయపడిన చిన్నబ్బాయి

రాజవొమ్మంగి: మండలంలోగి చికిలింత పంచాయతీ మద్దిబందల గ్రామానికి చెందిన జర్తా చిన్నబ్బాయి (31) గురువారం సాయంకాలం అడవి పంది దాడిలో తీవ్రంగా గాయపడ్డాడు. చిన్నబ్బాయి పశువులను మేతకు తీసుకొని వెళ్లగా పొదల్లో పిల్లలతో పాటు పొంచి ఉన్న అడవి పంది ఒక్కసారిగా ఆయన మీద పడి గాయపరచింది. దీనితో చిన్నబ్బాయి ఎడమ చేయి నుజ్జు నుజ్జు అయ్యింది. కుటుంబీకులు అతనిని వెంటనే జడ్డంగి పీహెచ్‌సీకు తరలించగా డాక్టర్ నాగార్జున థమ చికిత్స అందజేసి అనంతరం మెరుగైన చికిత్స కోసం 108 సహాయంతో కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. తీవ్ర రక్తస్రావం కావడంతో అతని పరిస్థితి విషమంగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు.

శ్రమదానంతో పాఠశాలకు తాత్కాలిక షెడ్డు



రేకుల షెడ్డు నిర్మిస్తున్న గ్రామస్తులు

ముంచంగిపుట్టు: మండలంలోని జోలాపుట్టు పంచాయతీ కులబీరు గ్రామంలో ఉన్న ఎంపీయూపీ పాఠశాలకు గురువారం విద్యార్థుల తల్లిదండ్రులు శ్రమదానంతో తాత్కాలిక షెడ్డును నిర్మించారు. చదవు కునేందుకు తమ పిల్లలు పడుతున్న అవస్థలను గమనించిన విద్యార్థుల తల్లిదండ్రులు చందాలు వేసుకొని రేకులు కొని, శ్రమదానం చేసి రేకుల షెడ్డును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ సర్పంచ్ నీలకంఠం మాట్లాడుతూ విద్యార్థులకు పూర్తి స్థాయిలో పాఠశాల భవనం లేకపోవడంతో ప్రతి రోజు నానా అవస్థలు పడుతున్నారని, వర్షం పడితే పాఠశాల నిర్వహణ సైతం ఉపాధ్యాయులకు కష్టంగా మారుతుందని, విద్యార్థుల తల్లిదండ్రులు శ్రమించి తాత్కాలిక రేకుల షెడ్డు ఏర్పాటు చేయడంలో చదువులు జరుగుతున్నాయని, ప్రభుత్వం స్పందించి పూర్తి స్థాయిలో పాఠశాల భవనం మంజూరు చేసి విద్యార్థులకు భవన సమస్యను తీర్చాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అప్పన్నకు ఆర్జిత సేవలు



నిత్యకల్యాణంలో జీలకర్రబెల్లం ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం ఏడుగంటల నుంచి స్వర్ణపుష్పార్చన వైభవంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణ మండపంలో వేదికపై వేంజేంపజేశారు. విష్వక్సేణపూజ, పుణ్యాహవాచనం నిర్వహించారు. అష్టోత్తర శతనామావళి పటిస్తూ 108 స్వర్ణసంపెంగ పుష్పాలతో స్వామికి అర్చన చేశారు. విశేషంగా హారతులు అందజేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదాన్ని అందజేశారు. ఆలయ ఏఈవో ఆనంద్‌కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఘనంగా నిత్య కల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం నిత్య కల్యాణం ఘనంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను వేదికపై వేంజేంపజేసి ఉదయం 9.30గంటల నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేణపూజ, పుణ్యావాచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించాయ. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదాన్ని అందజేశారు.

ఫైనల్స్‌కు ఉత్తరాంధ్ర లయన్స్



బ్యాటింగ్ చేస్తున్న భరత్

విశాఖ స్పోర్ట్స్: ఏపీఎల్ మూడో సీజన్ ఫైనల్స్‌కు ఉత్తరాంధ్ర లయన్స్ చేరుకుంది. ఎలిమినేటర్‌లో విజయం సాధించిన వారియర్స్, క్వాలిఫైయర్–1లో పరాజయం పాలైన రాయలసీమ కింగ్స్ టైటిల్ పోరుకు అర్హత సాధించేందుకు శుక్రవారం పోటీపడనున్నాయి.

ఎలిమినేటర్ మ్యాచ్‌లో వారియర్స్ విజయం

నాకౌట్‌లో వైజాగ్ వారియర్స్ విజయం సాధించి క్వాలిఫైయర్‌కు చేరుకోగా.. నిరుటి టైటిల్ పోరులో తలపడ్డ కోస్టల్ రైడర్స్ ప్లేఆఫ్‌లోనే నిష్క్రమించింది. వైఎస్సార్ స్టేడియంలో గురువారం జరిగిన ఎలిమినేటర్ మ్యాచ్‌లో వైజాగ్ వారియర్స్ టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన కోస్టల్ రైడర్స్ ఏడు వికెట్లు కోల్పోయి 153 పరుగులు చేసింది. 71 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయిన రైడర్స్.. లేఖజ్ రెడ్డి(43) నిలకడగా ఆడి ఐదో వికెట్‌కు జట్టు స్కోర్‌ను 142 పరుగులకు చేర్చాడు. అభిషేక్ 42 పరుగులతో నిలిచాడు. కెప్టెన్ రషీద్ 24 పరుగులతో సుదర్శన్‌కు దొరికిపోయాడు. మల్లికార్జున, మనోహర్ రెండేసి వికెట్లు తీశారు. ప్రతిగా బ్యాటింగ్ ప్రారంభించిన వారియర్స్ ఓపెనర్ మనీష్ 13 పరుగులతో పెవిలియన్‌కు చేరాడు. అతని స్థానంలో వచ్చిన కెప్టెన్ భరత్‌తో కలిసి వైస్ కెప్టెన్, మరో ఓపెనర్ అశ్విన్ రెండో వికెట్‌కు 109 పరుగుల భాగస్వామ్యాన్ని నమోదు చేశాడు. 124 పరుగుల వద్ద అశ్విన్(67) సిద్ధార్థ బౌలింగ్‌లో ప్రమోద్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. భరత్(54), తేజ(14) అజేయంగా నిలిచారు. వారియర్స్ రెండు వికెట్లే కోల్పోయి 19 ఓవర్లలో 157 పరుగులు చేసి.. క్వాలిఫైయర్‌కు చేరింది.

ఓటమి పాలైన కింగ్స్

క్వాలిఫైయర్–1లో ఉత్తరాంధ్ర లయన్స్ ఆరు వికెట్ల తేడాతో కింగ్స్‌పై విజయం సాధించింది. టాస్ గెలిచి లయన్స్ లక్ష్య ఛేదనకే మొగ్గుచూపడంతో రాయలసీమ కింగ్స్ తొలుత బ్యాటింగ్‌కు దిగింది. నిర్ణీత ఓవర్లలో ఏడు వికెట్లు కోల్పోయి 130 పరుగులు చేసింది. పవర్‌ప్లే ముగిసేప్పటికి 35 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయింది. వంశీకృష్ణ(35) నిలకడగా రాణించాడు. వాసు, శ్రీనివాస్, కుమార్ రెండేసి వికెట్లు తీశారు. పవర్ ప్లేలోనే రెండు క్యాచ్‌లు కింగ్స్ జారవిడవడంతో ఆరు ఓవర్లకు లయన్స్ 31 పరుగులు చేసింది. పవర్‌ప్లేకు మరో బంతి ఉండగా రఫీ బౌలింగ్‌లో రవికిరణ్(5) లెగ్‌బిఫోర్‌గా దొరికిపోయాడు. లయన్స్ పది ఓవర్లు ముగిసేప్పటికి ఓ వికెట్ కోల్పోయి 62 పరుగులు చేసింది. కెప్టెన్ తపస్వి 34 పరుగులు చేయగా సాత్విక్ (5) వెంటనే వెనుదిరగడంతో తక్కువ స్కోరును కాపాడుకునేందుకు కింగ్స్‌కు అవకాశం దక్కింది. అయితే ఓపెనర్ తరుణ్ అర్ధసెంచరీ నమోదు చేసి విజయం దిశగా మార్గం సుగమం చేశాడు. దీంతో 17.2 ఓవర్లలో లయన్స్ నాలుగు వికెట్లు కోల్పోయి 134 పరుగులు చేసి ఫైనల్స్‌కు చేరుకుంది.

క్లుప్తంగా

అరకు ఎమ్మెల్యేకు అభినందనలు



ఎమ్మెల్యే మత్స్యలింగంనకు అభినందనలు తెలుపుతున్న జీసీసీ డీఎం సింహాచలం

అరకులోయ రూరల్: అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగంను గిరిజన సహకార సంస్థ డివిజనల్ మేనేజర్ సింహాచలం వారి సిబ్బందితో మర్యాదపూర్వకంగా కలిశారు. మండల కేంద్రంలోని శరభగూడ హౌసింగ్‌కాలనీలో నివాసముంటున్న అరకు ఎమ్మెల్యే మత్స్యలింగంను వారు గురువారం కలిసి దుశ్శాలువాతో సన్మానించి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. జీసీసీ సిబ్బంది కొండబాబు, గురు తదితరులున్నారు.

నేడు ఏపీజీఈఏ కమిటీ ఎన్నిక

చింతపల్లిరూరల్: స్థానిక ఎస్‌టీవో కార్యాలయం వద్ద శుక్రవారం ఏపీజీఈఏ(ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ అసోసియేషన్) మండల కమిటీ ఎన్నిక నిర్వహించనున్నట్టు ఏపీఈజీఏ జిల్లా అధ్యక్షుడు ఎస్.వి.రమణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని ఉద్యోగులు సద్వినియోగం చేసుకోని , అత్యధిక సంఖ్యలో హాజరుకావాలని ఆయన కోరారు.

వ్యక్తిగత శుభ్రత తప్పనిసరి



విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి రమేష్

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల-2లో కిలగాడ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు.విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు.వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా కిలగాడ పీహెచ్‌సీ వైద్యాధికారి రమేష్ మాట్లాడుతూ పాఠశాలల పరిసరాలు నిత్యం శుభ్రంగా ఉంచాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. రక్తహీనత సమస్యను అధిగమించేందుకు మంచి పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ఎటువంటి అనారోగ్య సమస్య ఉన్న వైద్యులను సంప్రదించాలని ఆయన కోరారు.హెచ్‌ఎం ప్రకాశం, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాలు మెరుగుపరచాలి



వంగసార పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న తహసీల్దార్ రామకృష్ణ

చింతపల్లిరూరల్: మండలంలో వంగసార గిరిజన సంక్షేమ శాఖ బాలికల ఆశ్రమ పాఠశాలను తహసీల్దార్ రామకృష్ణ గురువారం ఆకస్మికంగా సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. విద్యార్థుల విద్యాప్రమాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో విద్యా ప్రమాణాలు మెరుగుపరచాలని ఉపాధ్యాయులకు సూచించారు. మెనూ అమలు చేయాలని, పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

కార్మికునికి ఆర్థిక సాయం



తాపీమేస్త్రి వెంకటేశ్వర్లుకు ఆర్థిక సాయమందిస్తున్న కార్మికులు

అడ్డతీగల: రాయపల్లి పంచాయతీ వంగలమదుగు గ్రామానికి చెందిన తాపీమేస్త్రి పర్శిక వెంకటేశ్వర్లు తీవ్ర అనారోగ్యానికి గురై ఆపరేషన్ చేయించుకొని ఇంటి వద్దే ఉంటున్నాడు. ఆయన కుటుంబం ఆర్థికం ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని స్థానిక వినాయక తాపీ పనివార్ల సంక్షేమ సంఘం కార్మికుల తరపున రూ.5వేలు ఆర్థిక సాయం గురువారం అందించారు.

తల్లికి వందనం..ఎందరికో



- తల్లికి వందనం జీవోలో మెలికపై తల్లుల ఆవేదన
- ఎంత మంది పిల్లలున్నా లబ్ధి ఒక్కరికేనా?

అనంతగిరి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే తల్లికి వందనం పథకం కింద ఒక కుటుంబంలో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి చదువుకునేందుకు ఏడాదికి రూ.15వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తామని చంద్రబాబునాయుడు ప్రకటించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నమ్మి ప్రజలంతా ఓట్లేసి గెలిపించారు. విద్యా సంవత్సరం ప్రారంభమైంది. గత ప్రభుత్వం ఇచ్చే అమ్మఒడి పథకానికి పేరు మార్చి తల్లికి వందనం పేరుతో ఆర్థిక సాయం ఇస్తామని ప్రకటించిన చంద్రబాబు సర్కారు ఇంకా ఆర్థిక సాయం ఇవ్వలేదు. స్కూళ్ల ప్రారంభం కావడంతో ఆర్థిక సాయం కోసం తల్లులంతా ఎదురు చూస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకు చదివే పిల్లలకు కుటుంబంలో ఒకరికి అమ్మఒడి పథకం వర్తింపజేశారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదివే వారందరికీ ఈ పథకం వర్తింపజేశారు. చంద్రబాబు ఒక కుటుంబంలో పిల్లలు ఎంతమంది ఉంటే అంతమందికి ఆర్థిక సాయం అందిస్తామని ప్రకటించారు. అయితే పిల్లల లెక్కలు తీసేసి కేవలం ఒక్కో తల్లికి రూ.15 వేలు ఇవ్వనున్నట్లు జీవో పేరిట మార్గదర్శకాలు జారీ చేశారు. ఈ మేరకు హామీ ఇచ్చినట్టుగా అందరికీ ఇస్తారా? లేదా ఒక్కరికే ఇస్తారా? ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదివే వారందరికి ఇస్తారా లేక కేవలం ప్రభుత్వ పాఠశాలల్లో చదివే వారికే చెల్లిస్తారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి, దీంతో విద్యార్థుల తల్లుల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనా ఈ పథకం ద్వారా తొందరగా ఆర్థిక సాయం అందించాలని తల్లులు కోరుతున్నారు.

డబ్బులు జమ కాలేదు



పెదబయలు ప్రైవేట్ స్కూల్‌లో నాకుమార్తె 4వ తరగతి చదువుతుంది. బాబు నర్సరీ చదువుతున్నాడు. ఇద్దరికీ బుక్స్ కోసం రూ.7800 కట్టాను. ఇంకా ఫీజ్ కట్టాల్సి ఉంది. పాఠశాల ప్రారంభమై చాలా రోజులైనా నేటి వరకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు తల్లికి వందనం సొమ్ము ఇంకా జమకాలేదు. త్వరగా జమచేస్తే ఫీజు చెల్లించాలనుకుంటున్నాను.

– పల్టాసింగి సునీత, పెదబయలు

సొమ్ము అందించాలి



గత ప్రభుత్వ హయాంలో జగనన్న అమ్మఒడి పథకం ప్రైవేటు పాఠశాలల్లో చదివే పిల్లల తల్లులకు కూడా ఇచ్చారు. ప్రస్తుత ప్రభుత్వం తల్లికి వందనం పథకం కేవలం ప్రభుత్వ పాఠశాలలకు మాత్రమే ఇస్తుందని ప్రచారం జరుగుతోంది. నా ఇద్దరు పిల్లల్లో ఒకరు నాలుగో తరగతి, మరొకరు ఒకటో తరగతి చింతూరులోని ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్నారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా మాకు ఈ పథకం ద్వారా సొమ్ములు అందించాలి.

– కారం నవ్య, చింతూరు

హామీలు నెరవేర్చాలి



నాకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఓ ప్రైవేట్ స్కూల్‌లో చదువుతున్నారు. వారిలో నా కుమార్తె 7వ తరగతి, కుమారుడు 4వ తరగతి చదువుతున్నారు. గత ప్రభుత్వంలో మా పాపకు అమ్మఒడి అందింది. ప్రస్తుత ప్రభుత్వం బడికెళ్లే పిల్లలందరికీ తల్లికి వందనం సొమ్ము ఇస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే పిల్లల బుక్స్, ఇతరత్రా సామగ్రికి సొమ్ము చెల్లించాను. ఫీజు చెల్లించాల్సి ఉంది. ఇప్పటికీ తల్లికి వందనం సొమ్ము జమకాలేదు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చి సొమ్ము జమచేసి మలాంటి వారిని ఆదుకోవాలి.

– వెచ్చంగి లలిత, పెదబయలు

హామీ నెరవేరుస్తారని ఆశిస్తున్నాం



నాకు ఇద్దరు పిల్లలున్నారు. కంఠభంసుగుడ ప్రభుత్వ పాఠశాలలో నా కుమార్తె 4వ తరగతి, నా కుమారుడు 3వ తరగతి చదువుతున్నాడు. తల్లికి వందనం పేరుతో కుటుంబంలో చదువుతున్న పిల్లలందరికీ సొమ్ము జమచేస్తామని, ఒక్కొక్కరికి రూ.15వేలు ఇస్తామని కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు హామీలు గుప్పించింది. అధికారంలోకి వచ్చిన తరువాత పాఠశాలలు ప్రారంభమై నెల కావస్తున్నా నేటికీ ఖాతాలో సొమ్ము జమకాలేదు. హామీ నెరవేర్చాలని ఆశిస్తున్నాం.

– మొస్య సునిత, మాలిసింగరం గ్రామం, చిన్నలబుడు పంచాయితీ,అరకులోయ మండలం

ఆర్థికంగా ఆదుకోవాలి



నా భర్త కూలీ పనులకు వెళ్తాడు. నేను మాకు ఉన్న మేకలను మేతకు తీసుకొని వెళతాను. మాకు ముగ్గురు ఆడ పిల్లలు. ప్రస్తుతం స్థానిక ప్రభుత్వ పాఠశాలలో వారు 6, 4, 2వ తరగతి చదువుతున్నారు. చదువుకుంటున్న పిల్లలందరికీ తల్లికి వందనంలో భాగంగా ఒక్కో చిన్నారికి రూ.15వేలు ఇస్తారని ఎన్నికల ముందు చంద్రబాబు హామీ ఇచ్చారు. అందుకు అనుగుణంగా నా పిల్లలకు రూ.45వేలు వస్తాయని ఆశపడుతున్నారు. పాఠశాలలు ప్రారంభమైన నెల కావస్తున్నా తల్లికి వందనం సొమ్ము జమకాలేదు. కూటమి ప్రభుత్వం సొమ్ము జమచేసి మా లాంటి పేదలకు ఆదుకోవాలని కోరుతున్నాను.

– గోరా నాగమణి, అప్పలరాజుపేట, రాజవొమ్మంగి మండలం

హామీ అమలు చేయాలి



నాకు ముగ్గురు పిల్లలు. మాది వ్యవసాయ కుటుంబం. మా పెద్ద కుమార్తె ఓ ప్రైవేటు పాఠశాలలో 4వ తరగతి, రెండో కుమార్తె ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల పాఠశాలలో రెండో తరగతి చదువుతోంది. గత ప్రభుత్వ హయాంలో మా పెద్ద పాపకి అమ్మఒడి పథకం ద్వారా రూ.15వేలు అందింది. ఫీజును చెల్లించాం. ఈ ఏడాది ఇప్పటికి వరకూ నగదు జమ కాకపోవడంతో ఫీజు చెల్లించలేదు. తల్లికి వందనం పథకం ద్వారా రూ.30వేలు అందుతుందని ఆశగా ఎదురు చూస్తున్నాం. అయితే జీవోలో ఆంక్షలు ఉన్నట్టు తెలిసింది. ఈ పథకం వర్తిస్తుందన్న ఆశ లేదు. టీడీపీ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి.

– గొల్లోరి మణి, పాడేరు మండలం గురుపల్లి గ్రామం

ముగ్గురు పిల్లలు ఉంటే ఒక్కరికేనా..



ప్రభుత్వం అమ్మ ఒడి పథకం పేరు మార్చి తల్లి వందన పేరుతో బడి వెళ్లే పిల్లల తల్లుల ఖాతాలో డబ్బులు వేస్తామన్నారు. ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికి రూ. 15వేలు చొప్పున ఇస్తామన్నారు. ఇప్పుడేమో ప్రభుత్వం అనేక నిబంధనలు పెట్టినట్లు చెబుతున్నారు. ఒక పిల్లవాడి మాత్రమే రూ. 15 వేలు ఖాతాలు వేస్తారంటూ పలువురు చెబుతున్నారు. నాకు ముగ్గురు పిల్లలున్నారు. అమ్మాయి ఒకటో తరగతి, అబ్బాయిలు ఐదు, మూడు తరగతులు చదువుతున్నారు. తల్లికి వందనం పథకం ద్వారా రూ. 45 వేలు వస్తాయని ఆశపడుతున్నాం.

– పండా భవానీ, పందిరిమామిడి, రంపచోడవరం మండలం

ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలి



ఎంతమంది పిల్లలు చదివితే వారందరికీ తల్లికి వందనం ఇస్తారని చంద్రబాబు ఎన్నికల్లో హామీ ఇచ్చారు. అయితే కుటుంబంలో ఒకరికే పథకం వర్తిస్తుందని ఆరోపణలు వస్తున్నాయి. అలా కాకుండా ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకొని అందరికీ సొమ్ము అందేలా చూడాలి.

– దిబ్బ కుమారి, రాజేంద్రపాలెం

ఫీజులు చెల్లించాల్సి ఉంది



నాకు ఇద్దరు పిల్లలు. వారిలో ఒకడు మూడో తరగతి, మరొకడు ఒకటో తరగతి చింతూరులోని ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్నారు. గతేడాది మా పెద్దబ్బాయికి జగనన్న అమ్మఒడి సొమ్ములు పడ్డాయి. ప్రస్తుత ప్రభుత్వం ప్రైవేటు పాఠశాలలకు తల్లికి వందనం పథకం అమలు చేస్తుందో, లేదో ఇంకా తెలియదు. రూ.30 వేలు ఫీజు కట్టాల్సి ఉంది. ఈ పథకం ప్రైవేటు పాఠశాలలకు కూడా ఇవ్వాలి.

– దుర్గాదేవి, ఏజీకొడేరు, చింతూరు మండలం

ఎప్పుడిస్తారో...



నాకు ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు పదో తరగతి ,రెండవ కుమారుడు 6 వ తరగతి చదువుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఒక కుమారుడు పేరున అమ్మఒడి కింద నగదు వచ్చింది. ప్రస్తుత్త ప్రభుత్వంలో తల్లికి వందనం కింద ఇద్దరు పిల్లలకు ఒక్కొక్కరికి రూ.15 వేల చొప్పున రూ.30 వేలు వస్తాయని ఆశపడుతున్నారు. సొమ్ము ఎప్పుడు జమ అవుతుందోనని వేచిచూస్తున్నాను.

– కోట్ల అన్నపూర్ణ, చింతరేగుబల్లి

అందరికీ జమచేయాలి



నాపేరు సోమేల చిన్నతల్లి అనంతగిరి మండలం పినకోట పంచాయతీ.. నాకు ఇద్దరు కుమార్తెల్లో పెద్ద కుమార్తె 5వ తరగతి కోణం ప్రభుత్వ పాఠశాలలో, రెండోవ కుమార్తె 1వ తరగతి పినకోటలోని ఎంపీపీ పాఠశాలలోని చదువుతున్నారు. ఎన్నికల ముందు ఎంతమంది పిల్లలు ఉన్నా తల్లికి వందనం అందజేస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటించింది. ఎటువంటి నిబంధనలు లేకుండా అందరికి సొమ్ములు జమచేయాలి.

– సోమేల చిన్నతల్లి, పినకోట

త్వరగా సొమ్ము జమచేయాలి



కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తల్లికి వందనం పేరుతో కుటుంబంలో చదువుతున్న అందరి పిల్లలకు సొమ్ము చేయాల్సి ఉంది. నా బిడ్డను స్థానిక ప్రైవేట్ పాఠశాలలో ఒకటో తరగతిలో చదివిస్తున్నాం. ఫీజు చెల్లించాలని పాఠశాల యాజమాన్యం చెబుతోంది. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి త్వరితగతిన సొమ్ము జమ చేయాలి.

– జన్ని దేవి, అరకులోయ,

గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ కుమారి, పక్కన జెడ్పీటీసీ . శివరత్నం, ఎంపీడీవో ఉమామహేశ్వరరావు

గూడెంకొత్తవీధి: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీడీవో ఉమామహేశ్వరరావు అధ్యక్షతన గురువారం జరిగింది. సమావేశంలో పాల్గొన్న ఎంపీపీ బోయినకుమారి మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అధికారులు సత్వరమే పరిష్కరించాలన్నారు. సమావేశంలో పలు సమస్యలపై ప్రజాప్రతినిధులు అధికారులను ప్రశ్నించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అనేక సమస్యలున్నాయని ప్రధానంగా మధ్యాహ్న బోజన పథకం అమల్లో అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఎంఈవోను అడిగారు. దీనిపై తగిన చర్యలు తీసుకుంటామని ఆయన బదులిచ్చారు. వసతిగృహాల్లో మెనూ సక్రమంగా అమలు చేయాలని ఎంపీటీసీ రాజేశ్వరి కోరారు. గ్రామాల్లో చాలాచోట్ల సోలార్ ప్లాంట్‌లు చోరీకి గురయ్యాయని దీనిపై చర్యలు తీసుకోవాలని ఎంపీటీసీ బుజ్జిబాబు కోరారు. దీనిపై ఇప్పటికే ఫిర్యాదు చేసినట్టు ఏఈఈ ప్రభాకరరావు తెలిపారు. గంజాయి సాగు, రవాణా వంటి వాటిపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్టు ఎస్‌ఐ అప్పలసూరి తెలిపారు. మండలంలో ఇప్పటి వరకూ జరిగిన అభివృద్ధి కార్యక్రమాలు, చేపట్టనున్న పనులపై ఎంపీడీవో ఉమామహేశ్వరరావు వివరించారు. జెడ్పీటీసీ సభ్యురాలు శివరత్నం, వైస్ ఎంపీపీలు దేముడు, ఆనంద్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

విజయోత్సవ ర్యాలీని విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పద్మారావు

ముంచంగిపుట్టు: అరకు ఎంపీ, అరకు ఎమ్మెల్యే విజయోత్సవ ర్యాలీని మండల వైఎస్సార్‌సీపీ శ్రేణులంతా విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పాంగి పద్మారావు అన్నారు.మండల కేంద్రంలో స్థానిక జెడ్పీ క్యాంప్ కార్యాలయంలో పార్టీ నాయకులతో గురువారం సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యేలకు అత్యధిక మెజార్టీతో విజయం అందించిన ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలన్నారు.ఎన్ని కూటమిలు ఏకమై వచ్చినా గిరిజన ప్రాంతంలో వైఎస్సార్‌సీపీ పక్షానే గిరిజనులు ఉన్నారన్నారు. మండల వాసులకు కృతజ్ఞతలు తెలుపుతూ భారీగా విజయోత్సవ ర్యాలీని త్వరలో నిర్వహిస్తామని, మండల వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు,అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.త్వరలోనే తేదీని ప్రకటిస్తామన్నారు. ప్రధాన కార్యదర్శి జగబంధు, సర్పంచులు రమేష్, బాబురావు, గంగాధర్, ఎంపీటీసీ నోబ్బో, నేతలు జయదేవ్, జగన్నాథం, అర్జున్, తిరుపతి, సాధురాం, బలరాజు, సురేష్, నీలకంఠం, అప్పారావు, సుందరరావు, రాంప్రసాద్, దాసు, పులిరాజు, త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పశువైద్య శిబిరాలు



పశువులకు టీకాలను వేస్తున్న పశువైద్యాధికారి గణేశ్వరరావు

అనంతగిరి: మండలంలోని మారుమూల పినకోట, కివర్ల రెండు పంచాయతీల పరిధిలోని వేలగలపాడు, బల్లగరువు, మల్లంపేట, చింతపాక, పూతికపుట్టు, జాలడ గ్రామాల్లో గురువారం ప్రత్యేక పశువైద్య శిబిరం నిర్వహించినట్టు కాశీపట్నం పశువైద్యాధికారి సాగిరి గణేశ్వరరావు తెలిపారు. శిబిరాల్లో 248 పశువులకు లంపీ వ్యాధి చర్మవ్యాధి నిరోధక టీకాలు, 590 చీటుకు వ్యాధి నిరోధక టీకాలు, 76 గొర్రెలకు నీలి నాలుక నిరోధక టీకాలను వేశామన్నారు. పశు వ్యాధులపై రైతులకు అవగాహన కల్పించామన్నారు. పశువైద్య సిబ్బందికి సమాచారం అందిస్తే గ్రామాల్లోకి వచ్చి, టీకాలను వేస్తారన్నారు. జూనియర్ వెటర్నరీ అధికారి సుధావాణి, సిబ్బంది పాల్గొన్నారు.

నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఐవి

ఎటపాక: పోలవరం ప్రాజెక్టు నిర్మాణంపై పెట్టిన శ్రద్ధ నిర్వాసితులపై పెట్టి వారి సమస్యలు పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి ఐవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నందిగామ గ్రామంలో నిర్వాసితులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముంపు గ్రామాలను 42.5 కాంటూరులో చేర్చి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజి ఇచ్చి పునరావాసం కల్పించాలన్నారు. నిర్వాసితులకు రూ.10 లక్షల పరిహారం ఇవ్వాలన్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ వాసు మాట్లాడుతూ నిర్వాసితుల పక్షాన పోరాటాలు చేసి సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. రామారావు, సూర్యనారాయణ, చిన్ని, నాగయ్య, సీతయ్య తదితరులున్నారు.

ఆదివాసీలకు అన్యాయం

వై.రామవరం: మండలంలోని గుమ్మరిపాలెంలో గురువారం అఖిల భారత రైతు కూలీ సంఘం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కమిటీ రాష్ట్ర కార్యదర్శి ఎం.దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో మహాసభ జరిగింది. ఈ సందర్భంగా ఆయనతో పాటు పలువురు మాట్లాడుతూ సంతాల్ తిరుగుబాటును స్ఫూర్తిగా తీసుకుని అందరూ కలసికట్టుగా ఆదివాసీ హక్కుల పరిరక్షణకు పోరాడదామని పిలుపునిచ్చారు. ప్రస్తుత పాలకులు అడవులను, ఖనిజ సంపదను బడాబాబులకు అప్పగించి ఆదివాసీలకు అన్యాయం చేయడానికి చూస్తున్నారని ఆరోపించారు. దీన్ని వ్యతిరేకిస్తు పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సత్తిబాబు, వెంకట్ నాయుడు, సోమన్న, పాపన్న, రామయమ్మ, కాసులమ్మ, ఎర్రయ్య, అమ్మోజీ పాల్గొన్నారు.

ప్రభుత్వాల వైఫల్యంతో మహిళలపై దాడులు



విద్యార్థులతో మాట్లాడుతున్న రమాదేవి

అరకులోయ రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యంతోనే దేశంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమాదేవి చెప్పారు. మండల కేంద్రం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యకారణంగానే వరకు మహిళలపై అత్యాచారాలు, దాడులు, మత ఘర్షణలు, జరుగుతున్నాయన్నారు. విద్యార్థుల భవిష్యత్తుపై ప్రభుత్వాలు దృష్టి సారించాలన్నారు. విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. హైమా పాల్గొన్నారు.

నకిలీ వస్తువులు విక్రయిస్తే చర్యలు



మద్దిగరువు వారపు సంతలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న సంఘం నాయకులు, స్థానికులు

జి.మాడుగుల: తూనికల కొలతలు, కల్తీ నకిలీ వస్తువులు విక్రయిస్తే చట్టం ప్రకారం నేరమని, వ్యాపారులు నాణ్యత గల వస్తువులు విక్రయించాలని జిల్లా వినియోగదారుల సంఘం సమాఖ్య అధ్యక్షుడు బూడిద చిట్టిబాబు తెలిపారు. మండలంలో బొయితిలి పంచాయతీ మద్దిగరువు గ్రామంలో గురువారం జరిగిన వారపు సంతలో ఆ సంఘం ఆధ్వర్యంలో వినియోగదారుల హక్కులు, చట్టాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు, గిరిజన యువత అసాంఘిక కార్యక్రమాలకు దూరం ఉండాలన్నారు. ఇటీవల సంతలో మరణించిన కోళ్ల మాంసం, పాడైన చేపలు విక్రయించినట్టు ఫిర్యాదులు అందాయని, ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని అధికారుల చర్యలు చేపట్టాలని కోరారు. సంతలో గుట్కాలు, మత్తు పదార్థాలు విక్రయిస్తున్నారని, చట్టరీత్యా నేరమన్నారు. కొనుగోలు చేసిన వస్తువులకు రశీదు తీసుకోవాలని సూచించారు. శ్రీను, బాలన్న, కేశవరావు, చిన్నారావు, మోహన్, సభ్యులు , ఆర్‌టీఐ ప్రతినిధి నీలందొర పాల్గొన్నారు.

తాగునీటి బోరు ఏర్పాటు



తాగునీటి బోరును ప్రారంభిస్తున్న జమాల్‌ఖాన్

చింతూరు: స్థానిక బీసీ కాలనీలో తాగునీటి సమస్య పరిష్కరించేందుకు జమాల్‌ఖాన్ చారిటబుల్ ట్రస్టు ముందుకొచ్చింది. ఈ మేరకు కాలనీలో ఆ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన తాగునీటి బోరును ట్రస్టు చైర్మన్ జమాల్‌ఖాన్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో తాగునీటి సమస్యను తన దృష్టికి తీసుకురావడంతో తమ ట్రస్ట్ ఆధ్వర్యంలో బోరు వేయించినట్లు తెలిపారు. తాగునీటి బోరు ఏర్పాటుతో తమ ఇబ్బందులను తొలగించడం పట్ల కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. ట్రస్ట్ సభ్యులు షాజహాన్, రియాజ్, నటరాజ్, రాము, సాయిబాబు, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అరకులోయ రూరల్: మండల కేంద్రంలోని 33కేవి/11కేవి సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్‌ల మరమ్మతు పనుల నిమిత్తం మండంలోని పానీరంగిని, రవ్వలగుడ, కరసలిగుడ, ఆర్.డుంబ్రిగుడ గ్రామల్లో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు విద్యుత్ శాఖ ఈఈ ఎ.వి.ఎస్.ఎం .అప్పారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకారించాలని కోరారు.

అంకితభావంతో విధులు నిర్వహించాలి



కార్యక్రమంలో పాల్గొన్న రిటైర్డ్ డిప్యూటీ సీఈవో, ఎంపీడీవో, ఏవో

కొయ్యూరు: మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు.ఎంపీపీ బడుగు రమేష్, రిటైర్డ్ డిప్యూటీ సీఈవో వెంకట్రావు పాల్గొని మాట్లాడారు. పరిపాలనకు సంబంధించిన అంశాలపై మాట్లాడారు. పంచాయతీ అభివృద్ధిలో కార్యదర్శుల పాత్రను ఆయన వివరించారు. విధుల నిర్వాహణను వివరించారు. ఎంపీపీ బడుగు రమేష్ మాట్లాడుతూ ఇక్కడ పనిచేస్తున్న వారంతా అంకిత భావంతో విధులు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ఉద్యోగులు ఎక్కడకు వెళ్లినా ప్రజల కోసం పనిచేయాలని కోరారు. ఎంపీడీవో సీతయ్య మాట్లాడుతూ కార్యదర్శులకు బాధ్యతలు ఎక్కువగా ఉంటాయన్నారు. పారిశుధ్యం నుంచి వీధిలైట్ల వరకు అన్ని అంశాలను చూడాలన్నారు. చింతపల్లి, అనంతగిరి ఏవోలు రవీంద్ర, లక్ష్మీనారాయణ, మురళీకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బిల్లుల చెల్లింపు వేగవంతం



ఉపాధి హామీ సిబ్బందితో సమీక్షిస్తున్న ఏఈ కాంతి

అరకులోయ రూరల్: పెండింగ్‌లో ఉన్న హౌసింగ్ బిల్లులు వేగవంతంగా పూర్తి చేయాలని మండల హౌసింగ్ ఏఈ కాంతి తెలిపారు. స్థానిక ఉపాధి హామీ పథకం కార్యాలయంలో సిబ్బందితో ఆమె గురువారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని 14 పంచాయతీల పరిధిలో 2021-22కు సంబంధించి పీఎంఏవైజీ హౌసింగ్ గృహల ఒక్కో లబ్ధిదారునికి రూ.27,000 ఉపాధి హామీ పథకం ద్వారా సకాలంలో చెల్లించే విధంగా ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. ఆయా లబ్ధిదారుల వివరాలు సిద్ధం చేయాలని కోరారు. ఉపాధి హామీ పథకం ఏపీవో జగదీశ్వరరావు, ఈసీ జగదీష్ తదితరులున్నారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ



కళాశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న అధ్యాపకులు, సిబ్బంది

చింతపల్లిరూరల్: స్థానిక డిగ్రీ కళాశాల ఆవరణలో గురువారం ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కె.లీలాపావని తదితరులు మొక్కలు నాటారు.ఈ సందర్భంగా ఆమె మట్లాడుతూ గతంలో గిరిజన ప్రాంతాల్లో అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని, ప్రస్తుతం ఆ పరిస్థితికి భిన్నంగా ఇక్కడ పరిస్థితి కనిపిస్తోందన్నారు. చెట్లు నరికివేత, అడవికి మంట పెట్టడం వంటి కార్యక్రామాల వలన గిరిజన ప్రాంతాల్లో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయన్నారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకోందాం అని పిలుపునిచ్చారు. అధ్యాపకులు డాక్టర్ రమణ, సంతోషి, రవీంద్రనాయక్, జగదీష్ బాబు, బాలరాజు, జగత్‌రాయ్ పాల్గొన్నారు.